# మెడిసిన్

''మెడిసిన్ చదువుతానని గప్పాలు కొడితివే మల్లికా! గృహిణివైనావా? మెడిసిన్‌లో యే యూనివర్శిటీలోనూ సీటు లభించలేదా? పోనీ ముందే మంచి కోచింగ్ సెంటరుకి వెళ్లి యెంట్రన్స్ వ్రాయకపోయినావా? మనకు మంచి సెంటర్లే వున్నాయే'' అన్నది నీరజ, సోఫాలో కూర్చుని చీర అంచులు సద్దుకుంటూ.

మల్లిక ట్రేలో టీ, బిస్కెట్లు తెచ్చి బల్లమీదుంచి తానూ మరో సోఫాలో కూచున్నది.

''వైద్యం చేయటానికి మెడిసిన్ చదవాలా అని చూశాను నీరూ. మా వూళ్లో వో కాంపౌండరు బల్ల కట్టకుండానే డాక్టర్నని వైద్యం చేస్తూ చెల్లుబడి అవుతూ చాలా సంపాయించాడు. మెడిసిన్ చదివాననే అనుకోలేవూ పోయేదేమున్నదీ?'' అని టీ అందించింది మల్లిక.

''అలాగే అనుకుంటాను గానీ, మరి బల్లకట్టలేదేం? ఇల్లు కనుక్కొని వచ్చేటప్పటికి గంట పట్టింది. మనం కలుసుకుని పదేళ్లుగాలేదూ? నేను విదేశం వెళ్లిపోయినాను. మొదట ఒకటీ అరా ఉత్తరం పడేశావు గానీ మల్లికా! తరవాత వుత్తరాలే లేవు నీదగ్గర్నుంచి. కాంటాక్ట్ పోయింది. నాకు మన దేశం రావటానికే వీలు పడింది గాదు. స్కాలర్‌షిప్ మీద వెళ్లానేగానీ, అదే హానిహానిగా సరిపోయింది. అద్దెపోకముందే జాబ్ కోసం వేటకు బయలుదేరాను. అదొక సమస్యలాగా కనబడింది. పేయింగ్ గెస్టుగా వున్నాను. ఇల్లు తీసుకొని నలుగురం అద్దె భరించాల్సి వచ్చింది. యెవరిపేరుమీద యిల్లు తీయబడిందో వారికే యెక్కువ అధికారముంటుంది. అవన్నీ అలవాటు కావాలి. డూస్ అండ్ డోంట్స్ వుంటాయి. అనుకూలంగా వుండాలి. అక్కడి సొసైటీ, తిండీగూడా అలవాటు కావాలి. ఒంటరిగా వుండటం కష్టమే. అన్నీ కొని తెచ్చుకుని, నిలవ చేసుకోవాలి.

మార్కెటింగ్, షాపింగ్ నేర్చుకోవాలి '' అని స్టేట్స్ లో జీవితం యెలా వుంటుందీ చెపుతున్నది నీరజ.

మల్లిక టీ పోసింది. నీరజ మెల్లగా టీ సిప్ చేస్తూ ఛిప్స్ తింటూ బిస్కట్లు కొరుకుతున్నది గాని, తన ఫ్రెండ్ మల్లిక టీ త్రాగుతూ కప్పు బల్లమీదుంచి లేచి యేదో చేసి వచ్చి టీ అందుకోవటం, బిస్కట్ తింటూనే, అడిగే వారికి సమాధానమివ్వటం, లేచి ఫోన్ అందుకుని జవాబిచ్చి రావటం గమనించింది.

మల్లిక టీ పూర్తి చేసి నీరజను చూసి నవ్వింది.

''బల్ల కట్టలేదేమి అనా అడిగావూ? జగమెరిగిన బ్రాహ్మణునకు జందెమేలా? అని ఒక సామెత వున్నది. ఈ చుట్టుపట్ల ప్రసిద్ధి కెక్కాను గదా అని బల్లకట్టలేదు.''

''చాలా బిజీగా వున్నావే, పోనా. నీకు తీరిక వున్నప్పుడు ఫోన్ చేయి వస్తాను. నేను మా మేనత్త యింట్లో దిగాను. అమె ప్రెస్ విలేఖరి. ఫోనున్నది. ఇదుగో నంబరు'' అని చేతి సంచీ విడదీసి ఫోను నంబరు, అడ్రసు వ్రాసి కాగితమిచ్చింది. మల్లిక అందుకున్నది. ''ఫోన్ చేయటానికి టైముండదేమో. నువ్వే వుండిపో. ఫరవాలేదు. నైట్ గౌన్స్ కొత్తవి వున్నాయి. అవి వాడుకుంటూ నా దినచర్య చూడచ్చు. నీ విషయాలు యింకా నేను వినచ్చు. నీవింకా గృహస్థాశ్రమంలోకి వెళ్లినట్టు లేదు. ఆ దేశాచార ప్రకారం వెడ్డింగ్ రింగన్నా కంటబడలేదు. మన ఫ్రెండ్స్ వచ్చి చూసిపోతూ వుంటారు. వారినీ కలుసుకోవచ్చు. ఇక్కడ కూరుకుపోయినానని మీ మేనత్తకి ఫోన్ చేయి. జీన్సూ, దుప్పట్లు టవల్సూ వున్నాయి'' అని లేచింది మల్లిక.

నీరజకి వుండాలనే వున్నది. అత్త యింట్లో పొద్దుబోలేదు. టీవి మీద మంచి ప్రోగ్రామ్స్ రాలేదు. ఇరుగు పొరుగు రారు. అయిదో అంతస్తులో ఒక పడగ్గది

వుండే భాగంలో వున్నదత్త, మల్లికకి సాయపడదామనుకున్నది.

పొద్దున్నే నీళ్లు పాలూ పట్టుతూ టిఫిన్ చేయాలి. బోర్ వెల్ నించి టాంక్‌లోకి నీరెక్కించాలి పావుగంటే. గీసర్ ఆన్ చేసి అరగంటకి ఆఫ్ చేయాలి. పిల్లీ, కుక్క పిల్లలు రెండు వాటి సంగతి చూడాలి. పనిమనిషి వచ్చి గిన్నెలు తోమి అక్కడ పెట్టి వెళ్తే రెండోసారి కడగాలి. వాచ్‌మన్‌కి టీ యిచ్చి వుత్తరాలు పోస్టుచేయటానికివ్వాలి. పేపర్ బోయ్ పేపర్ విసిరేస్తాడు పైకి. కూరలొస్తాయి కొనాలి.

నీరజ కూడా తిరుగుతూ సాయపడింది. వార్తలు వింటుండగా చాకలి యిస్త్రీ గుడ్డలు తెస్తాడు. పద్దుచూసి, బుట్టలోని గుడ్డలు పైకి తీసి చాకలికి వేసి పద్దు రాయాలి.

తక్కిన భాగాలలోని వారేదో కావాలని వస్తారు. యివ్వాలి లేదా మెయిడ్‌ని పంపుతారు. ఈ పన్లకి తోడు ప్రైవేట్ ప్రాక్టీస్.

''అమ్మా! తలనొస్తా వున్నది. సాయంకాలం రాలేనేమో యిబ్బంది పడతారు. చుట్టాలుగూడా వచ్చారు. ఊష్టం తాకిందేమో. గొంతునెప్పి. యేదైనా టాబ్లెట్టివ్వరూ? గుడ్డ యిస్త్రీ చేసి పెడతా'' పనిమనిషి అంటున్నది. దానికి స్ట్రెప్‌సిల్ యిచ్చి టీ గ్లాసు వుప్మా వరండాలో వుంచింది మల్లిక. విక్స్ తైలం గొంతుకు రాచుకోటానికి ఇచ్చింది.

''అమ్మా! గేమ్సులో కాలికి దెబ్బ తాకింది. నువ్వు కోప్పడతావని నిన్న సాయంకాలం చెప్పలేదు. ఇవాళ కాలునడవనీయటం లేదు'' అన్నది కూతురు వనలక్ష్మి. యేడోయేడు. బాబ్డ్ జుట్టు.

మల్లిక వనలక్ష్మికి లైఫ్‌బోయ్ సోపుతో నీళ్లు పోసింది. డెట్టాల్ సోపుతో కాళ్లు కడిగింది. అంటీ సెప్టిక్ బర్నాల్ జాన్సన్ పౌడర్ వాడింది. బాగా ఆరాక జాన్సన్ బాండేజ్ పట్టీ వేసింది. తల దువ్వి గుడ్డలేసింది. ఇడ్లీ తిని బోర్నవీటా

తాగింది కూతురు. మేజోళ్ళూ బూట్లూ యెక్కించింది తల్లి. రిబ్బన్ కట్టింది. టిఫిన్ బాక్స్, పుస్తకాల సంచీ, మంచినీళ్ల బాటిల్ పట్టుకెళ్లి ఆటోలో కూచోపెట్టింది. తక్కిన పిల్లలతో వెళ్తుంది వనలక్ష్మి.

చాకలికి కంటి మందు వేయాలిట. కళ్లు మండుతూ యిసకపడినట్లున్నదట. మల్లిక మందులేసి దూది యిచ్చింది.

ఇలా పొద్దున యజ్ఞం జరుగుతూ వంటైంది. పటాలకి పూలు పెట్టి దేముడికి దణ్ణం పెట్టి దీపం వెలిగించి వూదొత్తులు వెలిగించి ఆర్పి స్టాండులో గుచ్చింది. యెదురు అపార్ట్‌మెంట్‌లోని స్టూడెంటు వచ్చి, నిన్నటి దినపత్రిక కావాలన్నాడు. ఎమ్‌సెట్ ఫలితాలు పడ్డాయిట. ''మందివ్వరూ ఆంటీ. మా అమ్మ యేదో కొత్త వంట చేసి తినిపించింది. అది అరగలేదు. అన్నం మరీ బిరుసైంది. రాత్రల్లా నిద్ర లేదు. పొట్ట వుబ్బింది. ఆకలి లేదు'' అని నిలబడ్డాడు. పత్రిక తెచ్చి ఇచ్చింది. డైజీన్ అనే మందుకలిపి తెచ్చి తాగమన్నది. మళ్లా రాత్రికి చిన్న సీసాలో పోసియిచ్చి తాగమన్నది. ఆ అబ్బాయి వెళ్లి పోయాడు. భోజనం వేళైంది. టేబిల్ మీద అన్నీ అమరుస్తున్నది నీరజ. మల్లిక అప్పడాలు వేయిస్తున్నది.

సెకండ్ ఫ్లోర్లో వుంటున్న రిటైర్డ్ ఆఫీసర్ వచ్చి విజిటర్స్ రూమ్‌లో కూచున్నాడు.

''మల్లికాంబా! నా బి.పి. మెషీను పనిచేయటం లేదు. కొత్త బాటరీలు వేయాలేమో. మీ మెషీన్‌తో చూస్తావా? ఇవాళ పొద్దుటినించీ తల అదిరిపోతున్నది'' అన్నాడు.

స్టౌ ఆర్పి అప్పడాలు అవతలుంచి, రక్తపోటు చూసే మెషీన్ తెచ్చింది. నీరజ సాయం చేసింది. రెండు సార్లు చూసి కాగితం మీద పెద్ద అంకెలు నోట్ డౌన్ చేసి అందించారు. బి.పి. కంట్రోల్ చేసే మాత్రలైపోయినాయట. వెళ్లి తెచ్చుకోవాలిట.

వెళ్లలేకపోయినాడట. ఒక చిన్న టాబ్లెట్ తెచ్చి నీళ్ల గ్లాసు అందించింది. మాత్ర వేసుకుని నీళ్లు తాగాడు. మరోటి రాత్రికి వేసుకోవటానికి పొట్లం కట్టి యిచ్చింది. థాంక్స్ చెప్పి వెళ్లిపోయాడు.

''చేతులు కడుక్కురా. అన్నం తిందాం. మళ్లా యెవరన్నా వస్తారు. అప్పడాలు మెత్తబడతాయి'' అని పిలుచుకెళ్లింది మల్లిక.

ఇద్దరూ మెల్లిగా ఒక్కొక్కటే తింటుండగా డోర్ బెల్ మోగింది. మల్లిక లేచి వెళ్లి పదినిమిషాలకి వచ్చింది. ''యేం కావాలిట'' నీరజ సాంబారూ అన్నం తింటూ అడిగింది.

''బాండేజ్ చుట్ట కావాలిట. ఫైలేరియా వల్ల కాలు వుబ్బిందిట. మాసినది కనబడలేదట. చుట్టటం సరిగా చాతకాలేదుట'' స్పూన్‌తో తింటూ చెప్పింది మల్లిక.

అలా రెండు మూడు సార్లు లేచి వెళ్లింది. నేసల్ డ్రాప్స్, చెవిలో మందు, దూది యిచ్చి వచ్చింది. సిరెంజ్ కావాలంటే ప్లాస్టిక్ ప్యాకెట్ యిచ్చి వచ్చింది.

'' ఇది యిల్లా ? మెడికల్ షాపా మల్లికా? ఓ డజన్ సిరెంజ్‌లు కొని వుంచుకోలేరు'' అన్నది నీరజ.

''మరినేను మెడికల్ ప్రాక్టీషనర్నని నీకు తెలియదు్దా?'' అని నవ్వింది మల్లిక.

భోజనమైంది. అన్నీ సర్ది గిన్నెలు పళ్లాలు అవతలుంచి వచ్చారు. ఒక చుట్టం వచ్చింది. ఎక్స్‌రే తీయించుకోవాలి. పొద్దున కరెంట్ లేదు. ఇప్పుడొచ్చింది. తోడు రమ్మన్నది. కారు తెచ్చిందని వెళ్లారు. ఆమె భర్త ఐ స్పెషలిస్టు దగ్గరకెళ్లాలి అని డ్రైవ్ చేస్తూ తీసికెళ్లాడు. ఇంటికి వచ్చి కొద్ది సేపే రెస్టు తీసుకున్నారు.

మరొక బంధువు వచ్చింది. రక్తం తీయాలి అన్నది. టెంపరేచర్ చూసి రాసివ్వమన్నది. ఫోన్ మోగింది. టెస్టు చేసే గదిలో రక్తం లెవెల్ గుర్తుచేసి వుంచమని

భర్త ఫోన్ చేశాడు. ఆపని చేయటం నేర్పింది నీరజకి. బెడ్ రూమ్‌లో అత్తగారికి జ్వరం నార్మల్‌కి వచ్చింది.ఆవిడకి పళ్లు లేవు. బన్ను తెచ్చి తుంచి పాలలో ముంచి తినమని తినిపించారు. వేడి హార్లిక్స్ గ్లాస నోటికందిస్తే తాగింది. పడుకున్నది. ఫాన్ వేసి దుప్పటి కాళ్లమీద కప్పి వచ్చారు.

ఆడపడుచు కూతురు పళ్లు పుచ్చి అయినాయని పీకించుకు వచ్చింది. ఐస్ వాటర్లో దూది వేసి యిచ్చింది.అద్ది బేసిన్‌లో వేయమన్నది మల్లిక. రక్తం కట్టింది. చల్లని పాలు తాగించింది. ఆ అమ్మాయి పడుకున్నది. కాసేపు డ్రాయింగ్‌రూమ్‌లో కూచుని కబుర్లు చెప్పుకుంటుండగా పోస్ట్‌మాన్ వచ్చి సంతకం చేయంచుకుని, పార్సెలూ, వుత్తరాలూ యిచ్చి, కాలు నొప్పికి మందు కావాలన్నాడు. ఫ్లెక్సాన్ యిచ్చింది. నీళ్ల గ్లాసు కింద వుంచింది. టాబ్లెట్ వేసుకొని నీళ్లు తాగి థాంక్స్ చెప్పి వెళ్లాడు పోస్ట్‌మాన్.

వాచ్‌మన్ వచ్చి వళ్లంతా నెప్పులన్నాడు. రిలాక్సిల్ అనే టాబ్లెట్ యిచ్చి చీటిమీద రాసి యిచ్చింది మల్లిక. ''పోయి తెచ్చుకో రాంబాబూ. ఇంకలేవు. రాత్రికీ వేసుకోవాలి. డ్రింకు తాగు'' అని గ్లాసు వుంచింది. సాయంకాలమౌతున్నది. ఒక ముస్లిమ్ ఫ్రెండ్ వచ్చింది కారులో. బెల్ కొట్టి లోపలికొచ్చి కూచున్నది. ''మేడమ్! దగ్గ జలుబూ గొంతు నెప్పికి, డాక్టర్ సాబ్ యేదో మందు యిచ్చేవారు. బాటిల్ కొని దగ్గరుంచుకోమంటే కొన్నాను గూడాను. కాని అది అయిపోయి నెల అయింది. సీసా కనబడలేదు. పేరూ గుర్తు లేదు. నేను నర్సరీ స్కూల్లో జాబ్ చేస్తూ వుంటాను. ఇంటి కెళ్తున్నాను. నా డాటర్‌కి అవి వచ్చి బాధపడుతున్నది. గొంతులో ముల్లు గుచ్చినట్లు నెప్పి అంటుంది. బడికి వెళ్లలేదు నిన్న యివాళ. రాసిస్తే ఆ బాటిల్ కొనుక్కుని వెళ్తాను దోవలోనే మెడికల్‌హాల్'' అన్నది. మల్లిక ఒక కాగితం మీద కాఫ్ సిరప్ అనీ, గ్లైకోడీన్ అనీ రాసి అందిస్తూ చెప్పింది. ''కొంచెం ఉప్పు గోరు వెచ్చని నీళ్లలో వేసి గ్లాసుతో యిచ్చి గార్గిల్ చేయమనండి. త్రోట్ పెయింట్ గూడా రాయవచ్చు. యిష్టం లేకపోతే వాడక్కర్లేదు'' అన్నది.

ఆ ముస్లిమ్ యువతి ఫ్రూటీ అనే ప్యాకెట్ బల్ల మీదుంచింది. ''అది గొంతులో మందురాయనివ్వదు మేడమ్ సిరప్ వాడతాను'' అని థాంక్స్ చెప్పి వెళ్లింది.

టీ తాగి రాత్రి వంట కుపక్రమించారిద్దరూ. నాలుగో అంతస్తులో వున్న క్రిస్టియన్ వృద్ధమాత వచ్చింది. యోగక్షేమం అడిగింది. ''హాట్ వాటర్ బాటిల్ కావాలమ్మాయి. నా బాటిల్ నీళ్లు కారిపోతున్నది. మోకాలు నెప్పికి నువే ఆ ట్రీట్‌మెంటిచ్చావు. తగ్గిపోయిందని సంతోషించాను. మళ్లా తిరగబెట్టింది. మందుగూడా యిద్దూ నీకు పుణ్యముంటుంది'' అన్నది.

నీరజ వేడినీళ్లు నింపి బాటిల్ తెచ్చి యిచ్చింది. మల్లిక మందు యిచ్చింది. రెండే టేబ్లెట్లుంటాయి నిములిడ్. ''యీ అమ్మాయేమౌతుంది నీకూ? అత్త వారి వేపా, పుట్టింటి వేపా?'' అలా కాసేపు ముచ్చటలాడి యెలాగైతేనేం వెళ్లిపోయింది.

2

నాలుగోనాడు మల్లిక భర్త, డి.యమ్.ఓ. కాంపు నించి వచ్చాడు. ఒకటే హడావుడి. ఆఫీసుకు పోవాలిట! కాలకృత్యాలు తీర్చుకుని భోజనం పెట్టేయమన్నాడు. డ్రైవర్‌కీ అన్నం పెట్టమన్నాడు.

''బెంజమిన్‌కి చలిగాలివల్ల జ్వరం తాకింది. మందు వేశాను. చల్ల పొయ్యకు. కూరా సాంబారూ అన్నం చాలు. విక్స్ టాబ్లెట్లు యివ్వు'' అన్నాడు. మల్లిక నీరజను పరిచయం చేస్తూ, ''బెంజమిన్‌కీ అన్నంలో వేడిపాలు పొయ్యమన్నారా?'' అన్నది నవ్వుతూ.

''అక్కర్లా, పచ్చడి మెతుకులు పడేస్తావేమోనని చెప్పాను. వుంటే ఒక కప్పు పాలు వేడిగా యివ్వు తాగుతాడు. వెళ్లాలిప్పుడే'' అన్నాడు భర్త యోగానందం.

''నేను వెళ్లేలోపల ఒక పేషంటు వస్తాడు. బ్లడ్ తీయాలి అన్నీ సిద్ధం చేయి''

అని భోజనం కానిచ్చి దుస్తులేసుకోటానికి బెడ్‌రూమ్‌లోకి వెళ్లాడు యోగానందం.

''యెలాగో వేడిపాలివ్వమన్నారు బాబు. దాంట్లో బెల్లం మిరియాలు పొడి వేసివ్వండి తాగుతాను. నాకది అలవాటు. అన్నం తినలేకపోతున్నాను'' అన్నాడు డ్రైవర్ బెంజమిన్. వాడి కళ్లు యెర్రగా జ్యోతులల్లే వున్నాయి. వేడి పాలలో బెల్లం మిరియాలు పొడివేసి అతని దగ్గరుంచింది మల్లిక.

నీరజ నవ్వుతూనే వున్నది. బాగా సహాయపడుతూనే వున్నది. కాని పడక వేసింది.

'' ఫ్లూ తాకింది నీరజా. అది కంటేజియస్. డ్రైవరుకు తాకిందట. బన్ వున్నది. మిల్క్ బ్రెడ్ వున్నది. గ్లూకోజ్ తాగుతావా? కలిపాను '' అన్నది మల్లిక.

''బావుంది మల్లికా. వున్న రోగులు చాలక నేను గూడా పనివేళా వచ్చి మంచమెక్కానే. నేను వేరే రూమ్‌లో పడుకుంటాను''.

''అలాగే, యేదైనా తీసుకో. నీరసిస్తావు లేకపోతే.'' నీరజ నవ్వుతూ గ్లూకోజు తాగింది గాని టెంపరేచర్ హెచ్చి కళ్లు మూతలు పడ్డాయి.

యోగానందానికి పని యెక్కువకావటం వల్ల ప్రయాణంవల్లా నడుం పట్టుకుపోయింది. పడుకోలేడు. తనంతట తను లేవలేడు.

''అదీ కండరాలలో నెప్పిలే.'' అంటూ మందులపేర్లు యేకరువు పెట్టి, ''ఇంట్లో అల్మర్లో పెట్టెల్లో వుంటాయి చూసి తీసుకురా. రాళ్లమీద బాలెన్సు చేస్తూ నడిచి వెళ్లాల్సి వచ్చింది. దోవలేదు కారుకి. అందువల్ల నడుం పట్టుకు పోయిందిలే. బల్లమీద భోజనం పెట్టు. నించునే తింటాను'' అని నవ్వాడు. మల్లిక వెతికి మందులు తెచ్చి అందించింది.

ఇలా వారం గడిచింది. బంధువులు, స్నేహితులు, పరిచితులు వస్తూ పోతూనే వున్నారు. నేల ఫినాయిల్‌తో తుడిపించి, మంచినీళ్లతో తుడిపించింది మల్లిక. దోమలు రాకుండా మందు కొట్టింది. బొద్దింకలు పోవాలని ఫ్లిట్ వాడింది. పూదొత్తులు వెలిగించి, అర్పి ప్రతీగదిలోను వుంచింది.

3

నీరజ లేచి తిరిగింది. పథ్యం తిన్నది. మధ్యాహ్నం ఒంటిగంట అయింది. మల్లిక టేబిల్ ముందు కూచుని అన్నీ వడ్డించుకుంటూ తింటున్నది. నీరజా తింటున్నది. ''నీవన్నట్టు మల్లికా! బల్లకట్టక్కర్లేదేమో. బల్ల కడితే డబ్బు కట్టాలి. ఇన్సులిన్ యింజెక్షన్, చిన్న చిన్న యింజెక్షన్స్ యివ్వటం గూడా నేర్చావే మల్లికా! సర్జరీ రన్ చేస్తున్నట్టున్నది నీ తీరు. ఆపరేషన్లు చేయవేమో. చెవులో పిచికారీ, గొంతులో మందు రాయటం గూడా నేర్పుగా చేస్తున్నావే. యోగానందం గారే నేర్పారా?'' అన్నది నవ్వుతూ.

'' ఆ. ఆ. ఆయనే. వంట చేయటం, పిల్లల్ని పెంచటం నేర్చుకోలేదూ. ఇవీ అలాగే. చిన్న చిన్న వాటి వల్ల ప్రమాదం లేదు. నీకు సరిగా తెలియకపోతే, దగ్గర్లో వున్న డాక్టర్ వద్దకి తీసికెళ్లాలి. అలా అందరికీ వైద్యం అందించాలి. హాస్పటల్లో అడ్మిట్ చేయాలి. వాళ్లు సమయానికి చేశావని సంతోషిస్తారు. అది సోషల్ వర్క్ అన్నారు. అన్నీ తానే చేయలేరుట. చేయక్కర్లేదట గూడానూ, అత్తగారు చూడూ, పై పనంతా చేయిస్తూ వంటా పెట్టూ గూడా నేర్పుతుందీ అలా అన్నమాట '' అని నవ్వుతూ పెరుగు అన్నం స్పూన్‌తో తింటున్నది. నీరజా నవ్వింది ''అది బాగానే వున్నది అసలు వ్యాధి యేమిటో కనిబెట్టగలరా అని చూడాలి. డిగ్రీ వున్నది గదా అని గమనించము''.

''మీ బావగారి మనమడిని తెచ్చి, ఆ పిల్లాడి తల్లి సిమ్‌టమ్స్ చెప్పింది. యేమీ తినడు నెట్టి వేస్తున్నాడు. జ్వరం వడలిపోతున్నాడు అని.''

''అది మలేరియా అమ్మాయీ. నోరు చేదెక్కి అన్నీ నెట్టి వేస్తారు పిల్లలు. పండు రసం తాగించాలి. రెసోచిన్ నాలుగోవంతు వేయగానే తగ్గిపోతుంది'' అన్నావు. అలాగే తగ్గిందని ఫోన్ చేసింది పిల్లాడి తల్లి.

''మీ పెద్దక్క మనమరాలు స్పృహతప్పిన బిడ్డను తెచ్చింది.''

''మోషన్సు అయినాయి. పడిపోయింది'' అని యేడిచింది. అల్ట్రాకార్బ్ బిళ్లసగం వాడి, మజ్జిగలో వుప్పురాయి వేసి కలిపి తాగించావు. నవ్వుతూ లేచిందా నాలుగేళ్ల బిడ్డ. తల్లి కళ్లు తుడుచుకున్నది. సి.యి. గారి ప్ర్యూనూ తెచ్చాడలాగే.''

''గంజిపోయాలి. పాలుగాదు. సగ్గు జావ, నూకల జావ, సేమియా జావ పోయచ్చును. చిన్న బిడ్డ గదూ ! యేదో విత్తనాలు మింగింది. అరగలేదు. డయేరియా వచ్చింది'' అని మందిచ్చావు. ఆ రాత్రికే వచ్చి 'అలాగే గంజి తాగించాము తల్లీ. మందు తాగించాము. తగ్గినాయి. మీ దయవల్ల బిడ్డ బతికి లేచి తిరిగింది. మజ్జిగలో వుప్పురాయి కలిపి తాగిస్తున్నాము తాగుతున్నది' అని దణ్ణం పెట్టి వెళ్లాడు.

''నువ్వే నిజంగా డాక్టరువనుకున్నాడేమో'' అని బాగా నవ్వింది నీరజ.

మల్లిక చేయి కడుక్కోవటానికి లేచింది.

''అందుకే నిన్ను వుండమన్నది. చాలా గమనించావే నీరజా! సి.యి. గారి భార్యా ఫోన్ చేసి తన ప్ర్యూన్ని పంపించింది. యింజక్షనివ్వమని అది గూడా చూశావూ?'' అన్నది మల్లిక.

'' ఆ. చూశాను. యెంత నమ్మిక అనుకున్నాను. బి. కాంప్లెక్స్ యిచ్చావు కండరం మీద. హోమియో గూడా చూస్తావా ?'' అన్నది నవ్వుతూ.

'' ఆ. ఆ. కావాలంటే అదీ యిస్తాను. పెద్ద పెద్ద కేసులు పట్టను. డాక్టరు

పేరు చెప్తాను. వెళ్తారు'' అన్నది మల్లిక టవల్ అందుకుని చేయితుడుచుకుంటూ.

''నే వెళ్తాను మల్లికా. పక్షం గడిచింది. థాంక్స్ ఫర్‌ది ఫన్'' అని లేచింది నీరజ.